VISION BHARATH REPORTER
విభారె
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారె" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా
అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్.
MOBILE:
9494498787,9440232308.

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 21-11-2023 సంపుటి: 06 సంచిక: 74 పేజీలు: 8 వెల: రూ 3-00

# విశాఖ తీరంలో భారీ అగ్నిప్రమాదం

## ఫిషింగ్ హార్బర్‌లో 60 బోట్లు దగ్ధం
## ప్రమాదంలో తప్పిన ప్రాణనష్టం
## మత్స్యకారుల బోట్ల దగ్ధంతో జాలర్ల ఆందోళన
## విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్
## ప్రమాద ఘటనపై రంగంలోకి దిగిన పోలీసులు



విశాఖపట్టణం,నవంబర్20 విశాఖ ఫిషింగ్ ఆర్బర్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. వేకువ జామున ఒక్కసారిగా చెలరేగిన మంటలకు 60కిపైగా బోట్లు తగలబడిపోయినట్టు స్థానికులు చెబుతున్నారు. స్థానికంగాఉండే ప్రజలు వెంటనే అప్రమత్తం అయినప్పటికీ ఆస్తినష్టాన్ని తగ్గించలేకపోయారు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక కేంద్రాలకు కూడా సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. కొన్ని గంటల పాటు మంటలు ఎగసిపడుతూనే ఉన్నాయి. ఇది ప్రమాదంలా లేదని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చేసిన పనిగా స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి విచారణ జరిపించాలని కోరుతున్నారు. స్థానిక మత్స్యకారులకు ఈ బోట్లే ప్రధాని జీవనాధారం. రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో బోట్లు కాలిపోవడంతో వాళ్లంతా బోరున విలపిస్తున్నారు. ఒక్కో బోటు ఖరీదు 40 నుంచి 50 లక్షల రూపాయలు ఉంటుందని అంటున్నారు. ఈ బోట్ల వల్ల కోట్లలో నష్టం వాటిల్లిందని చెబుతున్నారు. బోట్లలో ఉండే ఇంధనంతో మంటలు మరింత వ్యాపించాయి. ఎలాంటి ప్రాణ నష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా, అగ్ని ప్రమాదంపై సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.రాత్రిఫిషింగ్ హార్బర్‌లో ఓయూట్యూబర్మద్యం పార్టీ ఏర్పాటు చేసి, మద్యం మత్తులో ఘర్షణ పడినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బోటుకు నిప్పు పెట్టినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పరారీలో ఉన్న సదరు యూట్యూబర్, అతని స్నేహితుల కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. వారిని పట్టుకుని విచారిస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రమాద స్థలంలో సీసీ కెమెరాల ద్వారా మరిన్ని వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ప్రమాద స్థలాన్ని జేసీ, అధికారులు పరిశీలించారు. ఘటనపై దర్యాప్తు జరుగుతోందని, నిందితులు ఎంతటి వారైనా వదిలి పెట్టమని, ఆస్తి నష్టంపై పూర్తి స్థాయి అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతానికి 60 వరకు బోట్లు కాలిపోయాయని చెబుతున్నప్పటికీ ఈ సంఖ్య మరింత ఎక్కువ ఉంటుందని మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నట్టు చెబుతున్నారు. అధికారులు వెళ్లి పరిశీలిస్తే కాని ఎంత నష్టం చెప్పలేని పరిస్థితి ఉందని మత్స్యకారులు అభిప్రాయపడుతున్నారు. ప్రమాద ఘటనతో బోటు ఓనర్లు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి ప్రమాదాలు చూడలేదని అంటున్నారు. ప్రమాదంలో జీవనాధారమైన తమ బోట్లు కాలిపోవడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ క్రమంలో ఫిషింగ్ హార్బర్ గేట్ వద్ద నిరసన చేపట్టారు.

# విశాఖ ప్రమాదంపై లోకేశ్ దిగ్భ్రాంతి

## పూర్తిస్థాయి విచారణ జరపాలని వినతి

అమరావతి,నవంబర్20 విశాఖ షిప్ యార్డులో జరిగిన అగ్నిప్రమాదంలో మత్స్యకారులకు చెందిన 40బోట్లు, కోట్లాది రూపాయల మత్స్యసంపద అగ్నికి ఆహుతికి కావడం బాధ కలిగించిందని టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. అత్యంత సున్నితమైన షిప్ యార్డు ప్రాంతంలో భద్రతాచర్యల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం దారుణమని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో నష్టపోయిన వారంతా రెక్కాడితే గానీ డొక్కాడని పేద మత్స్యకారులైనందున ప్రభుత్వం పెద్ద మనసుతో స్పందించి వారికి కొత్తబోట్లు, మెరుగైన నష్టపరిహారం అందించి ఆదుకోవా లన్నారు. అగ్నిప్రమాదంపై పూర్తిస్థాం యి విచారణ నిర్వహించి, మరోసారి ఇటువంటివి పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతాచర్యలు చేపట్టా ల్సిందిగా ప్రభుత్వాన్ని నారా లోకేష్ కోరారు.



# విశాఖ ప్రమాద ఘటనపై సిఎం జగన్ దిగ్భ్రాంతి

## ప్రమాదంపై తక్షణ విచారణకు ఆదేశం
## బాధితులకు అండగా ఉంటామని హామీ





అమరావతి,నవంబర్20 : విశాఖ ఫిషింగ్ హార్బర్ ప్రమాదంపై సీఎం జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో బాధితులను ఆదుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదంపై పూర్తి స్థాయి విచారణ జరిపి, కారణాలు అన్వేషించాలని నిర్దేశించారు. బోట్లు కోల్పోయిన మత్స్యకారులకు అండగా ఉండాలని, వారికి తగు సహాయం చేయాలని సూచించారు. సీఎం ఆదేశాల మేరకు మంత్రి సీదిరి అప్పలరాజు ప్రమాద స్థలానికి వెళ్లి పరిశీలించారు. కాగా, ఆదివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో 60కి పైగా బోట్లు దగ్ధం కాగా భారీగా ఆస్తి నష్టం సంభవించింది. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు అప్రమత్తం అయినప్పటికీ ఆస్తి నష్టాన్ని తగ్గించలేకపోయారు. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది 4 ఫైరిరజన్లు, ఓ ఫైర్ టగ్ నౌకతో మంటలు అదుపులోకి తెచ్చారు. బోట్లలో ఉండే ఇంధనంతో మంటలు మరింత వ్యాపించాయి. ఎలాంటి ప్రాణ నష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పలువురు బోట్లను సముద్రంలోకి తీసుకెళ్లడంతో కొంత నష్టం తగ్గిందని పేర్కొంటున్నారు. విశాఖ ఫిషింగ్ హార్బర్ ప్రమాదంతో స్థానిక మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదంలో జీవనాధారమైన తమ బోట్లు దగ్ధం కావడంతో బోరున విలపించారు. ఒక్కో బోటు ఖరీదు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షలు ఉంటుందని రూ.కోట్లల్లో నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి ప్రమాదాలు చూడలేదని చెప్పారు. ఈ క్రమంలో ఫిషింగ్ హార్బర్ ప్రధాన గేటు వద్ద నిరసన చేపట్టారు. ప్రమాద స్థలాన్ని సీఎం సందర్శించి తమకు వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాద స్థలంలో సీసీ కెమెరాల ద్వారా మరిన్ని వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. నిందితులు ఎంతటివారైనా వదిలి పెట్టమని, ఆస్తి నష్టంపై పూర్తి స్థాయి అంచనా వేస్తున్నట్లు జేసీ తెలిపారు.

# 'ఏపీలో కులగణనతో ఒక చరిత్ర ప్రారంభం కానుంది'



విజయవాడ: ఏపీలో కుల గణన -2023పై ప్రాంతీయ సదస్సు విజయవాడలో జరుగుతోంది. ఈ సదస్సుకు మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్, ఎమ్మెల్యే ముస్తఫా, ఎస్సీ కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, కె.లక్ష్మణరావు, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషు, విజయవాడ మేయర్ రాయన భాగ్య లక్ష్మి, పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి చెల్లుబోయిన మాట్లాడుతూ..'ఏపీలో కులగణన అనే చారిత్రక ఘట్టానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. సీఎం జగన్ సాహసోపేత మైన నిర్ణయం తీసుకున్నారు. దేశమంతా సీఎం జగన్ ఆలోచనల ను ఫాలో అవుతోంది. గతంలో మంజునాథన్ కమిషన్ ఫెయిలైంది. అందుకే సీఎం జగన్ శాశ్వత బీసీ కమిషన్‌ను వేశారు. బీహార్‌లో కులగణనకు రాజకీయ కోణం ఉంది. కానీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయం రాజకీయ ప్రయోజనాల కోసం కాదు.సామాజిక ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయం. అన్ని సామాజిక వర్గాలపై సీఎం జగన్‌కు ఎంతో గౌరవం ఉంది. గతంలో ఉద్యమాలు చేసినా కులగణన ప్రక్రియలో ఫలితాలు రాలేదు' అన్నారు.ఎంపీ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ..'ఏపీలో కులగణనతో ఒక చరిత్ర మొదలవ్వబోతోంది. బీసీలు ఏకమైతే రాజకీయంగా బలవంతులవుతారని 70 ఏళ్లుగా మనల్ని ఎదగనివ్వలేదు. సీఎం జగన్ ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. ఆనాడు మనకు రిజర్వేషన్లు కల్పించిన కారణజన్ముడు అంబేద్కర్. ఈనాడు కులగణనకు శ్రీకారం చుట్టి సీఎం జగన్ కారణజన్ముడయ్యాడు. ముఖ్యమంత్రి జగన్ రాజకీయాల కోసం కులగణన చేయడం లేదు. కులగణనపై రాజకీయ విమర్శలు చేయడం సరికాదు. ఏపీలో జరగబోయే కులగణన దేశానికే ఒక నిర్ధేశం అవుతుంది'.ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ.. కులగణన చేయా లని సీఎం జగన్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. సీఎం జగన్, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణకు ధన్యవాదాలు. అన్ని కులాలకు మేలు జరగాలని 90 ఏళ్ల తర్వాత సీఎం జగన్ ధైర్యంగా ఒక అడుగు ముందుకేశారు. మన దేశంలో కులం అనేది ఒక కల్చరల్ ఈవెంట్ వంటిది.

# స్కిల్ కేసులో చంద్రబాబుకు భారీ ఊరట

## రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు
## మధ్యంతర బెయిల్‌పై ఉన్న ఆంక్షలు తొలగింపు
## ఆరోగ్య నివేదికలను ఎసిబి కోర్టుకు సమర్పించాలని ఆదేశం
## యధావిధిగా రాజకీయ కార్యకలాపల్లో పాల్గొనే వెసలుబాటు



విజయవాడ,నవంబర్20 : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబుకు ఏపీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసులో చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్ లభించింది. షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసినట్లు హైకోర్టు తీర్పు వెల్లడించింది. ఈనెల 29 నుంచి బెయిల్‌కు అంతకు ముందు ఉన్న షరతులన్నింటినీ తొలగిస్తున్నట్లు హైకోర్టు ప్రకటిం చింది. ఈనెల 28లోపు చంద్రబాబు హెల్త్ రిపోర్టును విజయవాడ ఏసీబీ కోర్టు జడ్జికి సమర్పించాలని ఆదేశిం చింది. ఈనెల 29 నుంచి చంద్ర బాబు రాజకీయ ర్యాలీల్లో నేరుగా పాల్గొనవచ్చని వెల్లడించింది. దీంతో ఏపీ వ్యాప్తంగా టీడీపీ కార్యక ర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఇప్పటికే స్కిల్ కేసులో చంద్రబాబుకు ఇచ్చిన రిమాండ్ ఆర్డర్ సస్పెండ్ చేయాలని, ఎసిబిక్వాష్ చేయాలని సుప్రీంకో ర్టులో పిటిషన్ దాఖలు చేయగా గతంలోనే వాదనలు పూర్తయ్యాయి. గత నెలలో తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం రిజర్వ్ చేసింది. దీపావళి సెలవుల అనంత రం తీర్పు ప్రకటిస్తామని ధర్మాసనం చెప్పింది. రేపో, మాపో సుప్రీం ధర్మాసనం తీర్పు ప్రకటించనుంది. స్కిల్ డెవలప్‌మె ంట్ అక్రమ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబుకు విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. దీంతో 53 రోజుల పాటు చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైలులో జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. అయితే అనారోగ్య కారణాలతో చంద్రబాబుకు హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. ఈనెల 28 వరకు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. ఇటీవల స్కిల్ కేసులో చంద్రబాబు రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో మూడు రోజుల పాటు వాదనలు జరిగాయి. చంద్రబాబు తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, సీఐడీ తరపున ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. 2021 డిసెంబర్ 9న స్కిల్ కేసు నమోదు చేశారు. 2023 సెప్టెంబర్ 9న చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో చంద్రబా బును ఎ37గా సీఐడీ చేర్చింది. ఈ క్రమంలో హైకోర్టు అనారోగ్య కారణాలతో ఈ కేసులో ఇప్పటికే మధ్యంతర బెయిల్ పై ఉన్న ఆయనకు పూర్తి బెయిల్ మంజూరు చేస్తూ న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జున్ రావు తీర్పు వెలువరి ంచారు. ఈ నెల 28న చంద్రబాబు రాజమహేంద్రవరం జైలుకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. మధ్యంతర బెయిల్ మంజూరు సమయంలో విధించిన షరతులు ఈ నెల 28 వరకే వర్తిస్తాయని, 29 నుంచి రాజకీయ ర్యాలీలు, సభలు, ప్రెస్ మీట్లలో చంద్రబాబు పాల్గొనవచ్చని న్యాయమూర్తి తెలిపారు. అయితే, ఈ నెల 30న ఏసీబీ కోర్టు ముందు చంద్రబాబు హాజరు కావాలని ఆదేశించారు. చికిత్సకు సంబంధించిన నివేదికను ఏసీబీ కోర్టులో అందించాలని సూచించారు. సెప్టెంబర్ 9న స్కిల్ కేసులో చంద్రబాబును ఏపీ సీఐడీ అరెస్ట్ చేయగా పలుమార్లు బెయిల్ పై విచారణలు వాయిదా పడ్డాయి. అనంతరం, అనారోగ్య కారణాల రీత్యా ఆయనకు చికిత్స కోసం అక్టోబర్ 31న 4 వారాల మధ్యం తర బెయిల్ హైకోర్టు మంజూరు చేసింది. ఈ క్రమంలో ప్రస్తుతం చంద్రబాబు షరతులతో కూడిన బెయిల్ పై బయట ఉండగా పూర్తి బెయిల్ మంజూరైంది

# సంపాదకీయం

మంగళవారం 21-11-2023

## మాంద్యంలోకి ఐటీ ఇండస్ట్రీ..?

భారతీయ టెక్ ఉద్యోగులకు ఇప్పుడిప్పుడే లేఆఫ్ హీట్ తగులుతోంది. చాలా దేశాల్లో ప్రఖ్యాత కంపెనీలు గత ఏడాది చివరి నుంచే ఎడాపెడా ఉద్యోగులను తొలిగించి ఖర్చులను తగ్గించుకున్నాయి. పరిస్థితులు మరింతగా దిగజారుతున్న వేళ కంపెనీలు మరింత కఠినంగా వ్యవహరిస్తున్నాయి. గడచిన రెండేళ్లుగా టెక్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా నిరంతరం ఉద్యోగుల తొలగింపులు కొనసాగుతూనే ఉన్నాయి. చాలా కంపెనీలు అధిక జీతాలు అందుకుంటున్న, అనేక సంవత్సరాలుగా తమ వద్ద పనిచేస్తున్న ఉద్యోగులను సైతం వదులుకున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు దాదాపు 2.5 లక్షల మంది టెక్కీలను ఇళ్లకు పంపేశాయి. ఇది గత ఏడాది నమోదైన తొలగింపుల కంటే 50 శాతం అధికం. ముందుగా గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, అమెజాన్ వంటి కంపెనీలు తొలగింపులను ప్రారంభించగా చివరికి ఆ ప్రభావం స్టార్టప్ కంపెనీలను కూడా తాకింది. గతవారం నాటికి 1,106 కంపెనీలు 2,48,974 మంది ఉద్యోగులను తొలగించాయి. గత ఏడాది 1,54,336 మందిని ఇదే సమయంలో టెక్ కంపెనీలు లేఆఫ్ చేశఆయి. ప్రధానంగా రిటైల్ టెక్, కన్స్యూమర్ టెక్ రంగాల్లో ఉద్యోగుల తొలగింపులు ఎక్కువగా నమోదయ్యాయి. అయితే ఏడాది ముగిసే నాటికి తొలగింపులు ఇంకా ఉంటాయని తెలుస్తోంది. ఈ క్రమంలోనే అమెజాన్ తాజాగా తన అలెక్సా విభాగంలో ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. ఇక భారతీయ టెక్ కంపెనీల విషయానికి వస్తే సరైన డీల్స్ లేక కంపెనీలు డీలా పడ్డాయి. మరో పక్క నియామకాలను సైతం దాదాపుగా నిలిపివేశాయని ఇటీవలి త్రైమాసిక ఫలితాలను అన్వేషించగా వెల్లడైంది. పైగా బెచ్ పై ఉద్యోగులు ఎక్కువగా కొనసాగటం.. ఖర్చులను తగ్గించుకునేందుకు వేతన పెంపులను వాయిదా వేయటం, కొన్ని విభాగాల ఉద్యోగులకు హైక్స్ నిరాకరించటం వంటి చర్యలతో ప్రస్తుతానికి ఉపశమనం పొందుతున్నాయి. అయితే ఈ ధోరణి ఇలాగే మరికొన్ని త్రైమాసికాలు కొనసాగితే ఇండియాలో సైతం టెక్ కంపెనీలు ఉద్యోగుల కోతలకు వెళ్లక తప్పని పరిస్థితులు ఏర్పడతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.త ఏడాదితో పోల్చితే ఉద్యోగుల కోతలు 40 శాతం మేర పెరిగినట్లు నివేదిక హైలైట్ చేసింది. దీన్నిబట్టి 2023లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని స్పష్టమవుతోంది. టెక్ రంగం నుంచి మాంద్యం సంకేతాలు ఉన్నందున.. అనేక కార్యాలయాలు మూతపడ్డాయి. 2022లో టెక్ కంపెనీలు 1,64,744 మంది ఉద్యోగుల తొలగించాయి. గణాంకాల ప్రకారం 2023లో ఉద్యోగాల కోతల సంఖ్య పెరిగింది. కేవలం జవవరి ఒక్క నెలలోనే 75,912 మంది టెక్కీలు తమ ఉద్యోగాలను కోల్పోయారు. ఫిబ్రవరిలో 40,000 మంది.. ఆ తర్వాత మూడు నెలల కాలంలో దాదాపు 73,000 మంది తొలగించబడ్డారు. తర్వాత దాదాపు 24 వేల మంది ఉద్యోగులు తమ ఉద్యోగాలను వదులుకోవాల్సి రావటంతో గత వారం వరకు మె?త్తం 2,26,117 తొలగింపులు నమోదయ్యాయి. కరోనా తర్వాత ప్రపంచ ఆర్థిక పరిస్థితులు అస్థిరంగా మారటంతో.. 2021 నుంచి టెక్ కంపెనీలు మూడేళ్ల కాలంలో 4 లక్షల మంది టెక్ ఉద్యోగులను తొలగించాయి. అనిశ్చిత ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణం, సరఫరా గొలుసు అంతరాయాలు, ఆదాయ వృద్ధి మందగించడం ఉద్యోగాల కోతలకు ఆజ్యం పోశాయి. ఈ క్రమంలో గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి దిగ్గజ కంపెనీలు తొలగింపుల్లో ముందు వరుసలో నిలిచాయి. ఈ వాతావరణంలో ఇండియన్ టెక్ కంపెనీలు హైరింగ్ ఫ్రీజ్ కొనసాగిస్తున్నాయి. ప్రాజెక్టులు లేక అధిక సంఖ్యలో ఉద్యోగులు ఖాళీగా ఉండటంతో ఆందోళన చెందుతున్నాయి.మెజాన్ లేఆఫ్స్ కొనసాగిస్తోంది. గత కొన్ని నెలలుగా అనేక ఏఐ కార్యక్రమాలను అమలు చేస్తున్న అమెజాన్..కస్టమర్ సమీక్ష నుంచి డెవలపర్, దాని ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ లో వారి సొంత ఏఐ టెక్నాలజీని ఉపయోగించడం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా అమెజాన్ తన ప్రముఖ వాయిస్ అసిస్టెంట్ అలెక్సాను నిర్వహించే యూనిట్ లో వందలాది ఉద్యోగులను తొలగిస్తోంది. ఉద్యోగులకు లేఆఫ్స్ నోటీస్ విడుదల చేసింది.కస్టమర్ల కు మరిన్ని సేవలు, ఏఐ పై ఎక్కువ దృష్టి సారించడంతో కంపెనీకు చెందిన కొన్ని కార్యక్రమాలను పూర్తి తొలగించాం..అందులో పనిచేసే ఉద్యోగులను కూడా తొలగిస్తున్న అమెజాన్ అలెక్సా ఫైర్ టీవీ వైస్ ప్రెసిడెంట్ డేనియల్ చెప్పారు. ఎన్ని ఉద్యోగాలు తొలగిస్తున్నారు అనేది స్పష్టం గా తెలపలేదు. ఇది అమెరికా, కెనడా, భారత్ లోని ఉద్యోగులపై ప్రభావం చూపుతుందని చెప్పారు.ఉత్పాదక ఏఐ క్రేజ్ ను ఉపయోగించుకునేందుకు ఇతర కంపెనీలతో సీటెల్ ఆధారిత అమెజాన్ పోటీ పడుతోంది.

# సమాజ్ వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాశంకు ఘన సత్కారం







విభారె న్యూస్ నవంబర్ 20 ఒంగోలు.సమాజ్ వాదీ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు యాదవ్ ను ఘనంగా సత్కరించారు.ఆదివారం నాడు స్థానిక ప్రకాశం జిల్లా రాజధాని ఒంగోలు పట్టణం యన్టీఆర్ కళ క్షేత్రం నందు యాదవ విద్యావంతులు వేదిక ఆధ్వర్యంలో తలపెట్టిన పాశం వెంకటేశ్వర్లు సన్మానసభ కార్యక్రమం పందరబోయిన రవిశంకర్ యాదవ్ అద్యక్షతన జరిగింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సామాజిక న్యాయం కేవలం సమాజ్ వాదీ పార్టీ ద్వారానే సాధ్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు.ఆదివారం నాడు ఒంగోలు పట్టణంలో జరిగిన పాశం వెంకటేశ్వర్లు యాదవ్ ఆత్మీయ సన్మానం

## సమాజ్ వాదీ పార్టీ ద్వారానే సామాజిక న్యాయం..: పార్టీ అధ్యక్షులు పాశం

కార్యక్రమంలో పాశం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తాను పార్టీ భాద్యతలు చేపట్టిన తర్వాత ఎంబిబిఎస్ సీట్లు బిసిలకు జరిగిన అన్యాయం పై పెద్ద ఎత్తున ఉద్యమం మరియు కులగణన కోసం రాష్ట్ర వ్యాప్తంగా వందలాది సమావేశాలు నిర్వహించటం బీహార్ రాష్ట్రప్రభుత్వం కులగణన చేపట్టిన విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా కులగణన చెయ్యాలని కోరుతూ పెద్ద ఎత్తున ఉద్యమ స్ఫూర్తి సభలు సమావేశాలు నిర్వహించటం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కులగణన కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ఆయన అన్నారు.రామ్ మనోహర్ లోహియా సోషలిస్టు ఆలోచన విధానం తో సమాజ్ వాదీ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బలమైన ప్రత్నయ శక్తిగా మార్చేందుకు ఉద్యమంగా ముందుకు సాగేలా వ్యూహం సిద్దం చేసామని ఆ దిశగా అడుగులు పడుతున్నాయి అని అన్నారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశంలో సోషలిస్టు భావజాలం కల్గిన ఏకైక పార్టీ సమాజ్ వాదీ పార్టీ అని అలాంటి సమాజ్ వాదీ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షులుగా పాశం వెంకటేశ్వర్లు ను నియమించటం శుభ పరిణామాన్ని అన్నారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బిసి ఎస్సీ ఎస్టీ మైనారిటీ వర్గాలకు రాజ్యాధికారం లో వాటా సాధన కోసం సమాజ్ వాదీ పార్టీని బలమైన ప్రత్నయ శక్తిగా బలోపేతానికి కృషి చేయాలని కోరారు.జిల్లా నలుమూలల నుంచి వచ్చిన యాదవ విద్యావంతులు,పాశం వెంకటేశ్వర్లు అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషులు సమాజ్ వాదీ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు యాదవ్ ను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ జిల్లా నాయకులు వైవి సుబ్బారావు, సమాజ్ వాదీ పార్టీ నాయకులు ఎర్రగడ్డ నాగరాజు,డబ్బకొట్టు రామకృష్ణ, కళ్యాణ్ కుమార్, కార్తిక్ రాజు, రవి కిరణ్, దేవరాల రవణయ్య, బంకా చిరంజీవి, పులి రమణ, కొత్తగోర్ల వెంకటేశ్వర్లు, కసిబిసి నాగేశ్వరరావు,మందగిరి వెంకటేష్ యాదవ్, రాష్ట్ర జిల్లా స్థాయి వివిధ పార్టీల, కుల సంఘాల నాయకులు మరియు సమాజ్ వాదీ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# వేల్పులగోపాల్ కు బిజెపి నాయకుల సన్మానం..





విభారె న్యూస్ నవంబర్ 20 కోడుమూరు.కోడుమూరు నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ కో కన్వీనర్ గా వేల్పులగోపాల్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీమతి దగ్గుపాటి పురందేశ్వరి నియమించడంతో సోమవారం కోడుమూరు నందు కర్నూలు జిల్లా భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చ నాయకులుని ఘనంగా సన్మానించడం జరిగింది ఈసందర్భంగా కోడుమూరు నియోజకవర్గ కోకన్వీనర్ వేల్పులగోపాల్ మాట్లాడుతూ నాకు ఈ బాధ్యత ఇచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షులు శ్రీమతి పురందేశ్వరి అలాగే సహకరించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులకు జిల్లా నాయకులకు జిల్లా అధ్యక్షులు కనిగిరినీలకంఠ జిల్లా ఇంచార్జి అంకల్ రెడ్డి నా హృదయపూర్వక ధన్యవాదములు ఈక్షణం నుంచి 2024 లోను కోడుమూరు నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ విజయం సాధించేవరకు ఎక్కడ విశ్రమించకుండా పనిచేస్తానని కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా ఏ ఇబ్బంది వచ్చినా 24 గంటలు మీ సేవలో పని చేయడం కోసం అదేవిధంగా నియోజకవర్గంలో ఉన్నటువంటి ప్రజల యొక్క బాధలు నా బాధలుగా భావించి పనిచేయడం కోసం నేను సిద్ధంగా ఉన్నాను 2024 లో బిజెపి జెండా ఎగరవేయడమే నా ప్రధానమైనటువంటి లక్ష్యం ఈయొక్క నియోజకవర్గం కైవసం చేసుకుని రాష్ట్ర అధ్యక్షులు శ్రీమతి పురందేశ్వరి బహుమతికి ఇవ్వాలనేదే మా ప్రధానమైనటువంటి ముందున్న లక్ష్యం ఆదిశగా నేటి నుంచే కార్యచరనాలు మొదలు పెడుతున్నాం వై యస్ కాంగ్రెస్ పార్టీని గద్దెకు దింపాలంటే భారతీయ జనతా పార్టీకి మద్దతు తే బాధ్యత ఎంతైనా అవసరం ఉందని నియోజకవర్గ ప్రజలకు గమనించాలి మీయొక్క సహకారం మాకు కావాలి మీకు నిస్వార్థంగా పనిచేయడం కోసం మేము వస్తున్నాం ఆదిశగా మీరు మాకు సహకారం అందిస్తారని మిమ్మల్ని హృదయపూర్వక కోరుకుంటున్నాను అని వారు చెప్పడం జరిగింది ఈయొక్క కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చ ప్రధాన కార్యదర్శి మురళినాయుడు జిల్లా ఓబీసీ మోర్చ ప్రధాన కార్యదర్శి ఉల్చాల లక్ష్మణ్ నాయుడు మంజునాథ్ పాల్గొని మాట్లాడుతూ నియోజకవర్గంలోన పార్టీ బలోపేతం కోసం అందరి యొక్క సమిష్టి కృషి చాల అవసరం ఆదిశగా ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్త ముందుకు కదలాలని జరిగింది అలాగే ఈకార్యక్రమంలో దేవరాజు మద్దిలేటి రాజేష్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# జగన్ ప్రభుత్వం పై తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధం కండి...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :-నవంబర్ 20 అంగన్వాడీల సమస్యల పరిష్కారానికై డిసెంబర్ 8 నుండి జరిగే నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.షేబారాణి,సిఐటియుజిల్లా కార్యదర్శి టి.శివరాం,మండల కార్యదర్శి ఏ.వి.భాస్కరరెడ్డి అంగన్వాడి యూనియన్ నాయకులు ఎన్.సులోచన,కె.సుమలత ఎస్.రహమద్ బి,టి.స్వర్ణలత సుజాత అంగన్వాడీ వర్కర్లకు పిలుపునిచ్చారు.సోమవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం నందు సూపర్వైజర్ పరమేశ్వరికి సమ్మె నోటీసు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని,వేతనాల పెంపు,గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కొరకు అనేక రకాలుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామని,అనేకమార్లు విజ్ఞప్తి చేశామని అయినా ప్రభుత్వం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.గత్యంతరం లేని పరిస్థితులలో కోర్కెల పరిష్కారం కోసం 2023 డిసెంబర్ 8 నుండి నిరవధిక సమ్మె చేయాలని సిఐటియు,ఏఐటియుసి,ఐ ఎఫ్ టి యు అనుబంధ అంగన్వాడి యూనియన్ల రాష్ట్ర కమిటీలు ఉమ్మడిగా నిర్ణయించాయి అన్నారు.కావున జగన్ ప్రభుత్వం పై తాడో పేడో తేల్చుకోవడానికి జరుగుతున్న నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని అంగన్వాడీలకు పిలుపునిచ్చారు.ప్రభుత్వ మొండితనమే నిరవధిక సమ్మె నిర్ణయానికి దారి తీసిందని సమ్మె తప్ప అంగన్వాడీలకు గత్యంతరం లేదని అంగన్వాడి స్కూళ్ల విద్యార్థినీ,విద్యార్థుల తల్లి దండ్రులు,ప్రజలు సహృదయంతో అర్థం చేసుకొని అంగన్వాడీలు తమ న్యాయమైన కోరికల పరిష్కారానికై చేస్తున్న పోరాటానికి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.డిమాండ్స్ :-అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం,తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు,సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు,మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు,అంతవరకు మెయిన్ టీచర్లకు ఇచ్చే వేతనం అమలు,మినీ వర్కర్లకు ప్రమోషన్లు,రిటైర్మెంట్ బెనిఫిట్ 5 లక్షలతో పాటు ఆఖరి వేతనంలో 50% పెన్షన్,హెల్పర్ల ప్రవెూషన్లకు నిబంధనలురూపొందించడం, రాజకీయ జోక్యం అరికట్టడం,ప్రమోషన్ వయసు 50 సంవత్సరాలకు పెంచడం,సర్వీస్ లో ఉండి చనిపోయిన అంగన్వాడిల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడం,బీమా అమలు చేయడం,రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచడం, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం,వైయస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచడం,గ్యాస్ ను ప్రభుత్వమే సరఫరా చేయడం, పెండింగ్ లో ఉన్న సెంటర్ల అద్దెలు,2017 టీఏ బిల్లులు, ఇతర బకాయి బిల్లులు అన్ని వెంటనే ఇవ్వడం, లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు ఇవ్వడం,మూడు యాప్ లను రద్దుచేసి ఒకే యాప్ ద్వారా విధులు నిర్వహించే విధానం అమలు చేయడం,ఎఫ్ఆర్ఎస్ ను రద్దు చేయడి

# గ్రంధాలయాలు విజ్ఞాన భాండాగారాలు



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐ రమేష్ బాబు

ఫోటో రైట్ అప్ :- ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 20 విభారె న్యూస్ :- గ్రంధాలయాలు విజ్ఞానానికి నిలయాలు అని పట్టణ సీఐ రమేష్ బాబు అన్నారు. సోమవారం 56వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి సి ఐ రమేష్ బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

గ్రంధాలయాధికారి అరుణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాను తరచూ గ్రంథాలయానికి వెళ్లి అక్కడ పుస్తకాలను చదివి పోటీ పరీక్షలు రాసి పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించాలన్నారు. కృషి పట్టుదల ఉంటే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చు అన్నారు. గ్రంథాలయాల్లో అన్ని పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు ఉంటాయని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రసుధ పోటీ ప్రపంచంలో నిరుద్యోగులు కాలాన్ని వృధా చేయకుండా లక్ష్యం సాధించేంతవరకు అవిశ్రాంత పోరాటం చేయాలని సిఐ రమేష్ బాబు విద్యార్థులకు సూచించారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థిని విద్యార్థులకు ముఖ్యఅతిథిల చేత బహుమతి ప్రధానం చేయించారు. అనంతరం సిఐ రమేష్ బాబు సమాజ సేవకులు రామ సుబ్బారెడ్డిని గ్రంథాలయ అధికారి అరుణకుమారి మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైపిపీఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీర రాఘవయ్య, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫర్దుస్, కృషి విద్యానికేతన్, మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగిశెట్టి వెంకటసుబ్బయ్య, వెంకట రాముడు లు పాల్గొని విద్యార్థులకు సందేశాన్ని అందించారు. గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి గ్రంథాలయ అధికారి అరుణ్ కుమారి ధన్యవాదాలు తెలిపారు.

## న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి...

### అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్.



ఎమ్మిగనూరు టౌన్, నవంబర్ 20 విభారె న్యూస్:-కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ సమస్యలు పరిష్కరించకపోతే డిసెంబర్ 8 నుండి రాష్ట్రవ్యాప్తంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నట్లు యూనియన్ సభ్యులు నాగశిరోమని కృష్ణవేణి బసమ్మ వెంకటలక్ష్మి సిడిపిఓ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మార్చి 23న శాసనమండలిలో మంత్రి సమక్షంలో సమస్యలపై చర్చలు జరిగాయని అయినా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. అక్టోబర్ 9న జరిగిన చర్చలు విఫలమయ్యాయని సమస్యలు పరిష్కారానికి డిసెంబర్ 9 నుండి నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వము అంగన్వాడీలకు వేతనాలు పెంచాయని ఏపీ ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రాడ్యుటి అమలు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ఉన్న మినియేచర్ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ ను 5 లక్షలకు పెంచాలని, ప్రమోషన్ వయసు 50 సంవత్సరాలకు పెంచాలని, సర్వీస్ లో ఉండి చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగాలు ఇవ్వాలని, జీవిత బీమా అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరే రిటైర్మెంట్ వయసును 62 సంవత్సరాలు పెంచాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు, వైయస్సార్ పోషణ చార్జీలు పెంచాలని, వంట గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, పెండింగ్ లో ఉన్న డెంటల్ అద్దెలను చెల్లించాలని ,2017 టిఏ బిల్లులు ఇతర బకాయలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటియు సి, నాయకులు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## శాంజో విద్యార్థి జాతీయ క్రీడలకు ఎన్నిక....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- నవంబర్ 20 నంద్యాలలో 67వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కూల్ గేమ్స్ఫౌండేషన్ ఆధ్వర్యంలో 15 వ తేదీ నుండి 17 వ తేదీ వరకు పెన్సింగ్ గేమ్స్ జరిగాయి . మల్లాపు ఉదయ్ కుమార్ యం రామన్న (లెక్చరర్) యం. సునీత దంపతుల కుమారుడు ఇతడు శాంజో ఇంగ్లీష్ మీడియం స్కూల్ డోన్ లో 10 వ తరగతి చదువుతున్నాడు . అండర్ 17 పెన్సింగ్ గేమ్ ఇప్పి లో పాల్గొని వ్యక్తిగత విభాగంలో గోల్డ్ మెడల్ మరియు జట్టు తరుపున కూడా గోల్డ్ మెడల్ సాధించడం తో పాటు జాతీయ క్రీడలకు ఎన్నిక కావడం జరిగినది . అంతేకాకుండా గతంలో జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ గేమ్స్ లో జట్టు తరపున రెండుసార్లు బంగారు పతకాలను మరియు ఒకసారి బ్రాంజ్ మెడలను సాధించడం జరిగింది . భవిష్యత్తులో జాతీయ పతకాలతో పాటు ఇంకా ఎన్నో విజయాలు సాధించాలని తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు , మిత్రులు , స్కూల్ యాజమాన్యం ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ యం. ఉదయ్ కుమార్ కు శుభాకాంక్షలు తెలిపారు

## ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకంపై లబ్దిదారులకు అవగాహన



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 20 విభారె న్యూస్ :- మండలంలోని ఆర్. కృష్ణాపురం గ్రామస్తులకు సోమవారం ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ హౌసింగ్ డి.ఈ నాగరాజు, ఆళ్లగడ్డ ఏఈ రమణారెడ్డి మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం పై లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గృహాలు ప్రారంభించని వారితో ప్రారంభించి, పూర్తి చేసుకోవడంతో పాటు అలాగే ఇండ్లు నిర్మించుకోవడం ద్వారా ప్రభుత్వం నుండి వచ్చే అన్ని సదుపాయాలు లబ్ధిదారులకు వస్తాయని, డబ్బులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, లబ్ధిదారులందరూ త్వరితగతిన ఇండ్లు నిర్మించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రేమించి మోసం చేసిన ప్రవీణ్ ని కఠినంగా శిక్షించాలి...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :-నవంబర్ 20 శిరీష కు న్యాయం చేయాలి,ప్రేమించి మోసం చేసిన ప్రవీణ్ ను ఆర్మీ నుంచి ఉద్యోగం నుంచి తొలగించి కఠినంగా శిక్షించాలి ఐద్వా జిల్లా అధ్యక్షురాలు నిర్మలమ్మ డిమాండ్ మండల పరిధిలోని చిన్న మల్కాపురం గ్రామం శిరీష ను అదే గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్ నమ్మించి పెళ్లి చేసుకుంటానని ప్రేమ పేరుతో శారీరకంగా అనుభవించి ఇప్పుడు పెళ్లికి నిరాకరిస్తూ శిరీషను మోసం చేసిన ప్రవీణ్ ను తక్షణమే విధుల నుంచి తొలగించి కఠినంగా శిక్షించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా జిల్లా అధ్యక్షురాలు నిర్మలమ్మ గారు జిల్లా ఉపాధ్యక్షురాలు సేమియాగం గారు డిమాండ్ చేశారు సోమవారం నాకు న్యాయం చేయండి మహాప్రభు అంటూ శిరీష స్థానిక తాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన దీక్ష నిర్వహించడం జరిగింది ఈ దీక్ష కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐద్వా జిల్లా అధ్యక్షురాలు నిర్మలమ్మ జిల్లా ఉపాధ్యక్షురాలు షమీం బేగం మాట్లాడుతూ చిన్న మల్కాపురం గ్రామానికి చెందిన కే ప్రవీణ్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన శిరీష అనే అమ్మాయిని గత ఆరు సంవత్సరాల పైగా నిన్ను ప్రేమిస్తున్నాను పెళ్లి చేసుకుంటాను అని నమ్మబలికి అనేక చోట్ల కలిసి తిరిగి శారీరకంగా శిరీషను అనుభవించి ఆర్మీ జవాన్ గా ఉద్యోగం వచ్చిన పెళ్లి చేసుకోవడానికి నా తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదని అయినా కూడా నిన్ను నేను వదిలేది లేదు మా తల్లిదండ్రులను వదిలేసి వదిలేసిన నిన్ను పెళ్లి చేసుకుంటానని మరల అనేకసార్లు శారీరకంగా అనుభవించి ఇప్పుడు పెళ్లి చేసుకోమని అడుగుతుంటే పెళ్లికి నిరాకరిస్తూ మరొక యువతితో పెళ్లికి సిద్ధమవుతున్నాడని ఇలాంటివారిని కఠినంగా శిక్షించి మహిళలకు రక్షణ కల్పించాల్సినటువంటి బాధ్యత అధికారులపై ఉన్నదని వారన్నారు శిరీష మేజర్ కాకముందే శారీరకంగా వాడుకొని మోసం చేసిన ఇలాంటివారు దేశాన్ని రక్షించే ఉద్యోగంలో ఉండడం సిగ్గుచేటని ఈ దేశం నినాదమే జై జవాన్ జై కిసాన్ అనేటువంటి ఈ దేశంలో ఇలాంటి దుర్మార్గులు జవాన్ కి పనికిరారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రవీణ్ లాంటి దుర్మార్గులు మహిళలను మోసం చేయకుండా ఉండాలంటే ఈ ప్రభుత్వంపై మహిళలకు నమ్మకం కలగాలంటే తక్షణమే ప్రవీణ్ ను ఉద్యోగం నుంచి తొలగించి శిరీషను నమ్మించి శారీరకంగా వాడుకున్నందుకు రేప్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని అధికారులు న్యాయంపై నమ్మకం కలిగించాలని వారు కోరారు నేను యెడల అన్ని ప్రజాసంఘాలను రాజకీయ పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలోఐద్వానాయకురాలు షబానా అమృత మా దేవి నాగ జయమ్మ సులోచన లక్ష్మీదేవి నాగేశ్వరమ్మ జయమ్మ కృష్ణవేణి చిన్న మల్కాపురం గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాలు కేసులతో ఉక్కిరిబిక్కిరి

విజయవాడ, నవంబర్ 20, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో రెండు నెలల కిందటితో పోలిస్తే.. ఇప్పుడు మౌలికమైన మార్పులు వచ్చాయి. అదేమిటంటే.. రెండు నెలల కిందట ఎటు వైపు చూసినా టీడీపీ నేతల కార్యక్రమాలు కనిపించేవి. అప్పుడు వైఎస్ఆర్‌సీపీ నేతల హడావుడి పెద్దగా ఉండేది కాదు. కానీ ఇప్పుడు ప్రతిపక్ష నేతలు తమ కార్యాచరణ అమలు చేయడానికి ఇంకా క్లారిటీ కోసం చూస్తున్నారు. అయితే అధికార పార్టీ మాత్రం వరుస కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్తోంది. వాటికి ఆదరణ ఎలా ఉందన్న సంగతిని పక్కన పెడితే.. మొదట సామాజిక సాధికార బస్సు యాత్రలు చేశారు. ఇప్పుడు వై ఏపీ నీడ్స్ జగన్ పేరుతో ప్రజల్లోకి వెళ్తున్నారు. ఇది పేరుకు ప్రభుత్వ కార్యక్రమం కానీ.. అసలు మాత్రం వైసీపీ కార్యక్రమమే. రాజమండ్రిలో నిర్వహించిన మహానాడును సూపర్ సక్సెస్ చేసుకున్న టీడీపీ అక్కడే మినీ మేనిఫెస్టోను ప్రకటిచింది. ఆరు ప్రజాకర్షక హామీలను ఇచ్చి.. గ్యారంటీ పేరుతో ప్రజల్లోకి వెళ్లడం ప్రారంభించింది. చంద్రబాబునాయుడు ప్రాజెక్టుల ఆలస్యానికి వ్యతిరేకంగా యుద్ధ భేరీ అని.. భవిష్యత్ కు గ్యారంటీ అని పలు రకాల కార్యక్రమాలతో క్రమంగా ప్రజల్లోకి వెళ్తున్నారు. అదే సమయంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అని ఓ విడత ప్రచారం చేశారు. పార్టీ నేతలకూ అసైన్ మెంట్ ఇచ్చారు. పార్టీ నేతలంతా ప్రజల్లోకి వెళ్తున్నారు. మరో వైపు నారా లోకేష్ పాదయాత్ర సాగుతోంది. కుప్పంలో ప్రారంభమైన యాత్ర.. ఓ చరిత్ర సృష్టించే దిశగా సాగుతోం దన్న అభిప్రాయం టీడీపీ క్యాడర్ లో ఏర్పడింది. ఇలా టీడీపీ పూర్తి స్థాయిలో ప్రజల్లోకి వెళ్తున్న సమయంలో రాజకీయ పర్యటనలో ఉన్న సమయంలోనే చంద్రబాబును కర్నూలులో సీఐడీ పోలీసులు అరెస్టు? చేశారు. ఇప్పటికీ ఆయన మధ్యంతర బెయిల్ పై ఉన్నారు. పూర్తి స్థాయి బెయిల్ రాలేదు. మరో వైపు వరుసగా ఆరు కేసులు నమోదు చేశారు. సుప్రీంకోర్టులో 17ఏ కేసు సానుకూలంగా వస్తే తప్ప చంద్రబాబుకు రిలీఫ్ లభించదు. వ్యతిరేకంగా వస్తే ఎన్ని కేసులు పెడితే అన్ని కేసుల్లో బెయిల్ కోసం ప్రయత్నించాలి. కానీ చంద్రబాబు ఎన్నికల సన్నాహాలు దెబ్బతీయడానికి ఎన్ని కేసులైనా పెట్టి అరెస్టులు చేస్తూనే ఉంటారన్న ప్రచారమూ జరుగుతోంది. మరో వైపు చంద్రబాబు అరెస్టు పరిణామాల వరకూ వైఎస్ఆర్‌సీపీ పెద్దగా ప్రోగ్రామ్స్ పెట్టుకోలేదు. సీఎం జగన్ పథకాల బటన్లు నొక్కేందుకు జిల్లాలకు వెళ్లినప్పుడు ఎన్నికల ప్రచారం తరహాలో ప్రసంగాలు చేయడం, గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో ఎమ్మెల్యేలు, ఇంచార్జులు చేసే పర్యటనలు మినహా పెద్దగా కార్యక్రమాలు లేవు. చంద్రబాబు అరెస్టు తర్వాత టీడీపీ ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలు బ్రేక్ పడటంతో వైసీపీ అందుకుంది. బస్సు యాత్రలు.. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలను ప్రకటించి అమలు చేస్తోంది. ఇంటింటికివెళ్తోంది. మరో వైపు సీఎం జగన్ వివిధ అబివృద్ధి పనుల పేరుతో నియోజకవర్గాల పర్యటనలకు వెళ్తున్నారు. యితే టీడీపీని కట్టడి చేయడానికి వారి ఎన్నికల సన్నాహాలు దెబ్బతీయడానికి వైసీపీ పన్నిన వ్యూహం టీడీపీకి మేలు చేసిందనే అభిప్రాయం ఎక్కువగా నిపిస్తోంది. ఏ రాజకీయ పార్టీకైనా కావాల్సింది ప్రచారం. చంద్రబాబును అరెస్టు చేసినప్పటి నుండి ప్రపంచంలో తెలుగు వారు ఉన్న ప్రతి దేశంలోనూ ఆయనకు మద్దతుగా ప్రదర్శనలు జరిగాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు బెంగళూరు, చెన్నైల్లోనూ ప్రదర్శనలు జరిగాయి. యాభై రెండు రోజుల పాటు వీటిని కొనసాగిస్తూనే ఉన్నారు. చివరికి తెలుగుదేశం పార్టీ తెలంగాణలో పోటీ చేయడం లేదని ప్రకటించిన తర్వాత కూడా గచ్చిబౌలి స్టేడియంలో సీబీఎన్ గ్రాటిట్యూడ్ కాన్సర్ట్ నిర్వహించారు. నిజానికి చంద్రబాబు బయట ఉంటే.. సైబరాబాద్ ను నిర్మించానని పదే పదే చెప్పుకునేవారు. కానీ ఆయన జైల్లో ఉండటం వల్ల .. ఇలాంటి ప్రచారం ఐటీ ఉద్యోగులు చేశారు. చంద్రబాబు చేసిన మంచి పనులన్నీ ప్రజలకు తెలిసేలా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మధ్యంతర బెయిల్ వచ్చిన తర్వాత ఉండవల్లి నివాసానికి వెళ్లే ప్రతీ చోటా.. ప్రజలు పెద్ద ఎత్తున గుమికూడి స్వాగతం పలికారు. దీంతో చంద్రబాబు కాన్వాయ్ చాలా నెమ్మదిగా సాగింది. ప్రజా స్పందన చూసి టీడీపీ నేతలు సంతోషపడ్డారు. చంద్రబాబు అరెస్ట్ వల్ల టీడీపీకి మేలే జరిగిందని టీడీపీ వర్గాలు ఓ అంచనాకు వస్తున్నాయి. మరో నాలుగు నెలల్లో ఎన్నికల షెడ్యూల్ వస్తున్న సమయంలో టీడీపీకి మరింత మేలు చేసేలా పరిస్థితులు ఉన్నాయని టీడీపీ ఓ అంచనాకు వచ్చింది. వైసీపీలోనూ అదే అభిప్రాయం ఉంది. అందుకే సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఎన్నికలకు ముందు సింపతీ వచ్చేలా ఎందుకు అరెస్టులు చేస్తామని ప్రశ్నిస్తున్నారు. ఆయన ఉద్దేశం తమ ప్రమేయం లేకుండా అరెస్టు జరిగిందని చెప్పడమే. కానీ ప్రజలు ఎలా నమ్మగలరు ?3 ఏళ్ల చంద్రబాబును ఎదుర్కోలేక తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపారని ఆయనను జైల్లోనే ఉంచి.. ఎన్నికలకు వెళ్లాలనుకున్నారని టీడీపీ విస్తృత ప్రచారం చేసింది. చంద్రబాబు సతీమణి నిజం గెలవాలి పేరుతో ప్రజల్లోకి వెళ్లారు ఈ మధ్య కాలంలో వైసీపీ మంత్రులు చేసిన వివాదాస్పద ప్రకటనలు, చంద్రబాబు మరణం, భువనేశ్వరి అరెస్టు అంటూ చేసిన ప్రకటనలను ప్రజల్లోకి తీసుకెళ్లి సానుభూతిని పెంచుకునేందుకు ప్రయత్నించారు. చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రంలో పదేళ్లు సీఎంగా ఉన్నారు. ఇప్పటికే తెలంగాణలో ఆయన అధికారంలో లేక ఇరవై ఏళ్లు అయినా చంద్రబాబు ముద్ర కనిపించేలా చేసుకోగలిగారు. ఇదే విషయాన్ని బలంగా యువ ఓటర్ల దృష్టిలోకి తీసుకెళ్లగలిగారని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇవన్నీ కలిపి చంద్రబాబుకు సానుభూతి వచ్చిందని చెబుతున్నారు. టీడీపీ ప్రజల్లోకి వెళ్తున్న సమయంలో అరెస్టు ఎపిసోడ్ వచ్చింది. నిజానికి చంద్రబాబు పర్యటనలు, పవన్ యాత్ర... లోకేష్ యువగళం అన్నీ జరిగినా పూర్తిగా అయ్యేది. ప్రజలు బేరీజు వేసుకుని ఎవరికి ఓటు వేయాలో డిసైడ్ చేసుకుంటారు. కానీ ఇక్కడ రాజకీయాలకు అతీతంగా ఇంకేదో జరిగింది. అది ఓటింగ్ ప్రయారిటీలోకి వస్తోంది.

# సర్వే నివేదికలతో అడుగులు

విజయవాడ, నవంబర్ 20, సీఎం జగన్ నోరు తెరిస్తే నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అని ప్రకటనలు చేస్తారు. కానీ వారి విషయంలో మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తుంటారు. పేరుకే ఆయా వర్గాలకు మంత్రులు కానీ.. అధికారాల అంతా సకల శాఖామంత్రి కి అప్పగిస్తారు. సజ్జల వారే అన్ని నిర్ణయాలు తీసుకుంటారు. కేవలం బుగ్గ కారు, సెక్యూరిటీ, దర్పం తప్ప.. మిగతా విషయాల్లో ఫలితం శూన్యమని బాధిత వర్గాల నేతలకు తెలుసు. కానీ అధికారమనే కోణంలోనే ఆలోచిస్తూ కాలం గడిపేస్తున్నారు. అయితే ఎన్నికలు సమీపిస్తుండడంతో ఇటువంటి వారిని రాజకీయ సమాధి చేసేందుకు సిద్ధపడుతున్నారు అన్న వార్తలు వినిపిస్తున్నాయి.శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు వైసీపీలో సీనియర్లు ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. హై కమాండ్ చేస్తున్న సర్వేల్లో సైతం ఇది తేలుతోంది. కానీ వారు ఎవరిని మార్చే సాహసం జగన్ చేయరని పార్టీలోనే ఒక ప్రచారం జరుగుతోంది. అయితే ఎలాగైనా గెలవాలన్న కసితో ఉన్న జగన్ బీసీ, ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల విషయంలో మాత్రం ఒక ఆలోచన చేస్తున్నారు. ఆయా వర్గాల్లో ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్న వారికి ముఖం మీద చెప్పేస్తున్నారు. అవకాశముంటే ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పిస్తాను. లేకుంటే మాత్రం బాధపడకండి అంటూ నిర్మొహమాటంగా చెబుతున్నారు. అయితే ఈ విషయంలో కొందరు సీనియర్లకు, అగ్రవర్ణాల నాయకులకు మినహాయింపు ఇస్తుండడం పార్టీలో ఒక రకమైన చర్చ నడుస్తోంది. ప్రజా వ్యతిరేకత ఉంటే అందర్నీ మార్చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది. కానీ జగన్ ఇవేవీ పట్టించుకోవడం లేదు. కొన్ని నియోజకవర్గాల విషయంలో ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మేకతోటి సుచరితకు వేమూరు, అక్కడ ఎమ్మెల్యేగా ఉన్న నేరుగా నాగార్జునను సంతనూతలపాడుకు, సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్ బాబును గుంటూరు జిల్లాలో ఏదో ఒక ఎస్సి నియోజకవర్గం నుంచి పోటీ చేయించేందుకు జగన్ సిద్ధపడుతున్నట్లు సమాచారం. వీరంతా ఎస్సి నేతలు కావడం గమనార్హం.

## అన్ని పార్టీలు... బీసీ మంత్రమే...

కాకినాడ, నవంబర్ 20,ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలకు కాస్త సమయం ఉండగానే ప్రధాన పార్టీలన్నీ హామీలకు పదును పెడుతున్నారు. ఎన్నికలను ప్రభావితం చేయగలిగే ఓటు బ్యాంకుపై దృష్టి సారించాయి. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి రాజకీయ పార్టీలు. ప్రధానంగా ఏపీలో బీసీలు అధికం. ఆ తర్వాత కాపులు, ఎస్సీ, ఎస్టీ, ఇతర సామాజిక వర్గాల వారు ఉన్నారు. అందుకు కులాల ఎజెండాగా ఇప్పటి నుంచే పావులు కదుతున్నాయి పార్టీలు.ప్రతి ఎన్నికల్లో బీసీల ఓట్లు అత్యంత ప్రభావం చూపిస్తున్నాయి. అంతెందుకు బీసీలు ఎక్కువగా మొగ్గు చూపిన పార్టీ ఖచ్చితంగా అధికారం లోకి వస్తుందని కూడా గత ఎన్నికల్లో స్పష్టం అయింది. దీంతో వచ్చే ఎన్నికల్లో అధికారం చేజిక్కించు కోవడం కోసం ప్రధాన పార్టీలన్నీ బల హీనవర్గాల ఓట్లపై ఫోకస్ పెట్టాయి. ఈసారి ఆంధ్రప్రదేశ్లో కులాల వారీగా ఓట్లు చీలిపోవడం అనేది చాలాస్ప ష్టంగా కనిపిస్తుందంటు న్నారు ఎక్స్‌ఫర్ట్స్. అందుకే సీట్ల కేటాయి ంపులో కూడా స్థానికంగా బలంగా ఉండే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు అన్ని పార్టీలు సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటు న్నాయి.గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రికార్డు స్థాయి సీట్లతో అధికారం చేజిక్కించుకుంది. ఇందుకోసం బలమైన కారణం పెద్ద ఎత్తున బీసీ ఓట్లతో పాటు ఇతర సామా జిక వర్గాల ఓట్లు కూడా పోల్ అవడమేనని తెలిసింది. అందుకే ఈసారి కూడా బీసీలను తమవైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీలైన వైఎస్సార్ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించాయి. రాష్ట్రంలో మొత్తం 139 బీసీ కులాలున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ లెక్కలు వేస్తోంది. ఆయా కులాలకు ఎవరి హయాంలో ఏం జరిగిందనేది

# అక్రమంగా పగలు ఎర్రమట్టి - అర్ధరాత్రి ఇసుక రవాణా

## అక్రమ తవ్వకాలు నిలిపివేయాలని జనసేన డిమాండ్



గోనెగండ్ల నవంబర్ 20 విభారె న్యూస్ ప్రతినిధి:-× గోనెగండ్ల కేంద్రంగా అక్రమ ఇసుక ఎర్రమట్టి తవ్వకాలు యదేచ్ఛగా రవాణా చేస్తున్న వారిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకొని వారికి అడ్డుకట్ట వేయడం లేదని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు, జనసేన పార్టీ ఎమ్మిగనూరు నియోజక వర్గ ఇంఛార్జి రేఖగౌడ్ ఆదేశాల మేరకు గోనెగండ్ల జనసేన పార్టీ నాయకులు తహశీల్దార్ వేణు గోపాల్ కు వినతి పత్రం అందజేశారు, అనంతరం నాయకులు గానిగ బాషా మాట్లాడుతూ గత నెల రోజులుగా గోనెగండ్ల పరిధిలోని బాపురం కొండల్లో పట్టపగలు ఎర్రమట్టి తవ్వకాలు చేస్తూ హంద్రీనది వంకలో అర్ధరాత్రి వేళల్లో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు, సామాన్యులకు అందని ఖరీదైన ఇసుక కొందరికి సంప్రదిస్తే అందడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు, అధికారుల అనుమతులు లేకుండానే కొండ ప్రాంతాలను ఇష్ట రాజ్యాంగ త్రవ్వకాలు జరిపి గోనెగండ్ల నుంచి చుట్టూ పరిసర గ్రామాలకు ఎర్రమట్టిని యదేచ్ఛగా రవాణా చేస్తున్నారని తెలిపారు, ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించేలా అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల కనుసన్నల్లోనే ఇలా జరగడం దారుణమని ఇప్పటికైనా అధికారులు అక్రమ ఇసుక ఎర్రమట్టి తవ్వకాలను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు లేనిచో జనసేన పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు, ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ నాయకులు ఖాసిం సాహెబ్, మాలిక్, సుభాన్, వెంకటేష్, మల్లికార్జున, మునాఫ్,ఇబ్రహీం, లక్ష్మన్న, పాల్గొన్నారు.

# జిల్లా అవినీతి విద్యా శాఖ అధికారి (డీఈఓ) ను తొలగించాలి.

## - పీడీఎస్ యూ,యూ ఎస్ఎఫ్ఐ కలెక్టరేట్ ముందు ధర్నా..




కర్నూలు జిల్లా ప్రతినిధి నవంబర్ 20 విభారె న్యూస్.. జిల్లాలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ గాడి తప్పుతుంది అందుకు జిల్లా విద్యా అధికారి డీఈఓ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు కేవలం కుర్చికే పరిమితం అయ్యాడు ఇలాంటి అవినీతి విద్యా శాఖ అధికారి డీఈఓ రంగారెడ్డిని తొలగించాలి అని పీడీఎస్ యూ రాష్ట్ర కార్యదర్శి, రాజేష్, యూ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులుఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు అనంతరము సోమవారం కలెక్టర్కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలో అనేకమంది ఉపాధ్యా యులు పాఠశాలకు వెళ్లకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా మారారని అదేవిధంగా ప్రైవేటు కోచింగ్ సెంటర్లో నిర్వహిస్తూ ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో విద్యాబోధన చేస్తూ విధులకు వెళ్లకుండా వేలకు వేలు జీతాలు తీసుకుంటు పేద మధ్య తరగతికి చెందిన విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని గతంలో వీరిపై అనేకసార్లు జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లి వినతి పత్రాల అందజేసిన కనీస ఒక ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోలేదని అన్నారు.

# కార్తీక సోమవారం సందర్భంగా గౌరీ శంకర స్వామికి ప్రత్యేక పూజలు.

కర్నూలు జిల్లా ప్రతినిధి నవంబర్ 20 విభారె న్యూస్. శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా శ్రీ గౌరీశంకరస్వామి వారికి లఘున్యాస పూర్వక రుద్రాభిషేకములు, అర్చనలు జరుపబడినవి ఈ కార్యక్రమము లో భక్తులు పాల్గొని శ్రీ గౌరీశంకర స్వామి వారి కృపకు పాత్రులైనారు.



# మహిళా సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన పి శ్రావణ రెడ్డి గారికి, రాష్ట్ర సమితి సభ్యులు ఎన్నికైన గిడ్డమ్మ గారికి అభినందనలు



విభరె న్యూస్, నవంబర్ 20 కర్నూలు: ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య 17వ రాష్ట్ర మహాసభలు నంద్యాల నగరంలో మూడు రోజులపాటు నిర్వహించడం జరిగినది ఈ మహాసభలలో కర్నూలు జిల్లాకు చెందిన పి శ్రావణ రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా, బి గిడ్డమ్మ రాష్ట్ర సమితి సభ్యులుగా ఎన్నికయి కర్నూల్ కి వచ్చిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య కర్నూల్ నగర సమితి ఆధ్వర్యంలో వారికి పూలమాలలు వేసి అభినందనలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య నగర ఉపాధ్యక్షురాలు విజయ, ఆశ బేగం లు మాట్లాడుతూ శ్రావణి రెడ్డి , మాజీ కార్పొరేటర్ గిడ్డమ్మ , కర్నూల్ నగరం తో పాటు జిల్లా వ్యాప్తంగా మహిళా సమస్యల పైన నిరంతరం పోరు సాగిస్తూ, మహిళలకు ఏ చిన్న సమస్య ఉన్న మేమున్నామంటూ మహిళల న్యాయం హక్కుల కోసం పోరాటం సాగిసస్తూ మాలాంటి వారికి కొండంత అండనిస్తున్నారని, జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా కొనసాగుతున్న సందర్భంలో వారి ప్రతిభను గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా శ్రావణ రెడ్డిని, రాష్ట్ర సమితి సభ్యురాలు గడ్డమ్మ ఎన్నిక కావడం అభినందించదగ్గ విషయమని వీరిద్దరూ మహిళా సమస్యల కోసం నిరంతరం పోరాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఉంటున్నామన్నారు , శ్రావణి రెడ్డి, గిడ్డమ్మలు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కర్నూలు జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా ఉన్న మమ్మల్ని రాష్ట్ర కమిటీ గుర్తించి రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించిన రాష్ట్ర నాయకత్వానికి విప్లవ అభినందనలు తెలియజేస్తున్నామని భవిష్యత్తులో మహిళలకు 33% రిజర్వేషన్ కోసం , మద్యపాన నిషేధ కోసం, మహిళల రక్షణ కోసం, మరింత బాధ్యతగా ఉద్యమాలు నడిపిస్తామని రాష్ట్ర సమితి సభ్యులుగా ఎన్నికైన మాకు అభినందనలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి , మీడియా మిత్రులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య నగర నాయకురాలు సంధ్య, మహేశ్వరి, బీసమ్మ, అమీనాభి, సునంద, డిహెచ్ పిఎస్ జిల్లా కార్యదర్శి మహేష్ నగర కార్యదర్శి రామచంద్ర, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న జిల్లా ఉపాధ్యక్షులు శరత్ తదితరులు పాల్గొన్నారు.

# కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా అన్నదానం...



విభారె న్యూస్ డోన్ మా ప్రతినిధి :- నవంబర్ 20 పవిత్రమైన కార్తీక మాసంలో అన్నదానం అనేది ఎంతో పుణ్యఫలమని, ఆకలితో వున్నవారి కడుపు నింపడం అనేది నిజమైన దైవ సేవ అని స్ఫూర్తి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అలా మధు అన్నారు. కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా డోన్ పట్టణానికి చెందిన మానవతావాది, సాయిరామ్ హాస్టల్ యాజమాని నందికేశ్వర్ రావు సహకారంతో స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి ఎంతోమంది ఆకలి తీర్చారు. ఈ సందర్భంగా అన్నదానం చేయించిన దాత సాయిరామ్ హాస్టల్ యాజమాని నందికేశ్వర్ రావు కి ఆయన కుటుంబ సభ్యులకు స్ఫూర్తి సభ్యులు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు రాము బ్రహ్మానందరెడ్డి యోగ ఆటో అంజి శ్రీను తదితరులు పాల్గొన్నారు

# స్పందన కార్యక్రమంనకు వచ్చిన 108 ఫిర్యాదులకు విచారణ చేపట్టి న్యాయం చేస్తాం.



కర్నూలు జిల్లా ప్రతినిధి నవంబర్ 20 విభారె న్యూస్. స్పందన కార్యక్రమానికి 108 ఫిర్యాదులు.కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత్ ఐపియస్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ టి.సర్కార్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు.స్పందన కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 108 ఫిర్యాదులు వచ్చాయి.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...1)కర్నూలు ఆర్టీసి బస్టాండులో గద్వాల బస్సు ఎక్కేటప్పుడు నా మొబైల్ ఫోన్ ను తెలియని వ్యక్తులు దొంగలించారు. అంతేకాకుండా నా బ్యాంకు ఖాతా నుండి వేరే నెంబర్ కు ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించారని న్యాయం చేయాలని కర్నూలు, క్రిష్ణనగర్ కు చెందిన ఆనంద్ కుమార్ ఫిర్యాదు చేశారు. 2)కర్నూలు పాతబస్టాండ్ జే ఏ ఆర్ జ్యూవెలర్స్, లక్కీ గోల్డ్ స్కీం పేరుతో నెలకు రూ.1500 ప్రకారం మొత్తం 20 నెలలు కట్టించుకుని బంగారు లేదా వెండి లేదా బహుమతులు ఇస్తామని చెప్పి 5 నెలల నుండి ఫోన్ కాల్స్ చేస్తున్నా తీయకుండా మోసం చేస్తున్నారని కర్నూలు కు చెందిన ఏసురత్నం ఫిర్యాదు చేశారు. 3)నా భర్త నాగరాజు నన్ను, నా ఇద్దరి పిల్లలను పట్టించుకోకుండా డబ్బులు ఇవ్వాలంటూ, మద్యం సేవిస్తూ తిరుగుతూ మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని దేవనకొండకు చెందిన వెంకట లక్ష్మి ఫిర్యాదు చేశారు.4) పశువుల డైరీ ఫాం పెట్టుకున్నాను. అయితే 18 ముర్ర జాతి చిన్న పశువుల కొరకు హర్యాన రాష్ట్రం, కర్నల్ జిల్లా కు వెళ్ళి అమిత్ పహ్వా, రవి లకు రూ .6 లక్షల 40 వేలు ఇచ్చి పశువులను కొనుగోలు చేయడం జరిగింది.పశువులను ట్రాన్స్పోర్ట్ ద్వారా పంపిస్తామని చెప్పి ఇంతవరకు పశువులను పంపించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఈ. తాండ్రపాడు గ్రామానికి చెందిన మద్దెల చిన్నబి ఫిర్యాదు చేశారు. 5)పెంచికలపాడు కు చెందిన మియా అనే దళారీ నా దగ్గరు నుండి 28 క్వింటాళ్ల ప్రత్తి ని తీసుకెళ్ళి 19 క్వింటాళ్ళే ఉన్నాయని అబద్ధం చెబుతూ మోసం చేస్తున్నాడని గూడూరు మండలం, నాగలాపురం గ్రామానికి చెందిన సత్యనారాయణ చౌదరి ఫిర్యాదు చేశారు.6)నా భర్తకు రూ.3 లక్షల 30 వేలకు ప్లాట్ అగ్రిమెంట్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న షేక్ మొహమ్మద్ హుస్సేన్ పై చర్యలు తీసుకోవాలని పంచలిగాల గ్రామానికి చెందిన రజియా ఫిర్యాదు చేశారు.స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ టి. సర్కార్ హామీ ఇచ్చారు.ఈ స్పందన కార్యక్రమంలో డిఎస్పీ నాగభూషణం, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు,సిఐలు పాల్గొన్నారు.

# శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థాన రాజగోపురం నిర్మాణానికి భక్తుల విరాళం.



కౌతాళం నవంబర్ 20 విభారె న్యూస్.శ్రీ నరసింహ ఈరన్న స్వామిదేవస్థానరాజగోపుర నిర్మాణం కొరకు మాన్వి వాస్తవ్యులు శరణప్ప, కుటుంబసభ్యులు వారు .1,05,000/- విరాళంగా చెల్లించియున్నారు. దాతలకు దేవస్థాన ఆలయ అధికారులు శ్రీ స్వామి దర్శనం,స్వామివారి శేష వస్త్రాము,లడ్డూ ప్రసాదాలు,ఆశీర్వాదాలు కల్పించి,బాండు పేపర్, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో దేవస్థాన సీనియర్ అసిస్టెంట్ రామలింగారెడ్డి, దేవస్థాన ముఖ్య అర్చకులు నాగరాజ్ స్వామి, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీశైల దేవస్థానం అన్న ప్రసాద వితరణకు భక్తుల విరాళం.



శ్రీశైలం నవంబర్ 20 విభారె న్యూస్.శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి ఆలయంలో ప్రతినిత్యం భక్తులకు జరిగే అన్నప్రసాద వితరణ పథకానికి గాను విరాళంగా రూ.1,00,116/-లను జి. కరుణాకర్ రెడ్డి, తాడిపత్రి వారు విరాళాన్ని అందజేశారు.ఈ మొత్తాన్ని అన్నప్రసాద వితరణ పర్యవేక్షకులు సి. మధుసూదన్‌రెడ్డికి అందజేయడం జరిగింది. వీరికి దేవస్థానం వారు స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనం చేయించి, శాలువాతో సత్కరించి, స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

# బిజెపి ముఖ్య నాయకుల సమావేశం



ఒంగోలు.. విభారె న్యూస్ నవంబర్ 20 ఒంగోలు.ఒంగోలు జిల్లాలో ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సూచనల మేరకు కర్నూలు జిల్లా అధ్యక్షులు కునిగిరినీలకంఠ సారథ్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొని సమావేశంలో చెప్పిన విషాయలను గ్రామ గ్రామన ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు ఈకార్యక్రమంలో జిల్లా ఇంచార్జి అంకల్ రెడ్డి ప్రధానకార్యదర్శులు ఉపేంద్ర కోటియాదవ్ రాష్ట్ర నాయకులు టిజివెంకటేష్ చంద్రమౌళి పార్థసారథినగరూరి రాఘవేంద్ర రంగస్వామి సుధాకర్ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీమురళినాయుడు కర్నూలు జిల్లాలోనీ అసెంబ్లీ కన్వీనర్లు కో కన్వీనర్లు వేల్పులగోపాల్ సూర్యనారాయణ వేంకటరాముడు రంజిత్ కర్ని నాగరాజుగౌడు విష్ణువర్ధన్ రెడ్డి చిన్నఈరన్న తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల సమస్యల పరిష్కరించాలి

## ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)

కదిరి నవంబర్ 20 పట్టణంలో అంగన్వాడి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిడిపిఓ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పిల్లల అభివృద్ధి పథకానికి నిధులు పెంచాలని ఐసిడిఎస్ పథకానికి కావలసిన నిధులు కేంద్ర ప్రభుత్వం కేటాయించాలని ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న అంగన్వాడీ కార్యకర్తల జీతాలు, సెంటర్ అద్దెలు, కూరగాయల బిల్లులు, చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎఫ్ ఆర్ ఎస్ యాప్, రద్దు చేయాలని ఈ యాప్ మూలంగా అంగన్వాడి కేంద్రాల్లో ఉన్న లబ్ధిదారులకు సరుకులు, పోషకాహారం, లాంటివి అందించలేకపోతున్నామని వాపోయారు.ఈసమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో డిసెంబర్ నెలలోసమ్మెకుదిగుతామనిహెచ్చరించారు.ఈ కార్యక్ర మం లో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులుమాబునిస, సిఐటియు నాయకులు జగన్మోహన్, తాజుద్దీన్,ఫాజిల్, అంగన్వాడికార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190